క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

పెనమలూరు: పెనమలూరు సెంటర్ కిలారు అనిల్ ఎస్టేట్‌లో ఆదివారం నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యోగాచార్యులు నేరెళ్ల తులసీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోసాల శాఖ శ్రీ వెంకటేశ్వర యోగా సేవ ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ 28 రోజుల పాటు ఉంటుందని చెప్పారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9133306804 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యనమలకుదురులో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5, 6.30, 8, 9.30, 10.30, 11.30 గంటలకు రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం కూడా జరిగింది. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివార్లను మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు. శివసాధంలో స్వామివారికి ఆలయ పూజారులు శాంతికల్యాణం చేశారు. భక్తులు ఆకాశదీపం వెలిగించి తీర్థప్రాదాలు స్వీకరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పెనమలూరు: వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గంగూరు గ్రామానికి చెందిన నాదెళ్ల జగ్జీవన్‌రావుకు రూ. 2 లక్షలు, పోరంకి గ్రామానికి చెందిన బొల్లా దర్శినికి రూ. 3 లక్షల చెక్కులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు



గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణాదేవి సహిత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో కార్తికమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. తొలుత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామివారికి మహాన్యాసపూర్వక అష్టోత్తర శత కలశాత్మక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన జరిపారు. భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

దాడి కేసులో నిందితులకు రెండు రోజుల కస్టడీ

పెడన: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేనిపై దాడి కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఎనిమిది మందిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ గన్నవరం కోర్టు గురువారం ఉత్తర్వులు ఇవ్వడంతో వారిని శుక్రవారం రాత్రి పెడన పీఎస్‌కు తీసుకువచ్చారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద కాసరనేనిపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది వ్యక్తులను అప్పట్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసు పునఃవిచారణ పేరుతో గుర్రం అంజయ్య(నాని), కర్నాటి నిరంజన్, ఓలుపల్లి మోహన్‌రంగా, మేచినేని బాబు, అనగాని రవి, గోనూరు సీమయ్య, భీమవరపు యతేంద్ర రామకృష్ణ(రాము), సూరపనేని అనిల్‌కుమార్‌లను నిందితుల జాబితాలో చేర్చారు. వీరిని ఈ నెల 19న అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలతో నెల్లూరు సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. అదనపు విచారణ కోసం నిందితులను కస్టడీకి కోరుతూ గన్నవరంలోని 8వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. వాదనల అనంతరం రెండు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అప్పగించడానికి కోర్టు అనుమతించింది. దీంతో శుక్రవారం రాత్రి పెడన పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పెడన పోలీస్ స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిడమానూరులో కలుషితమవుతున్న బుడమేరు కాలువ

కాలుష్య కోరల్లో బుడమేరు కాలువ

- ఆహారం, కుళ్లిపోయిన కూరగాయలు డంపింగ్
- కార్పొరేట్ కళాశాలల వ్యర్థాలన్నీ బుడమేరులోకే
- పట్టించుకోని అధికారులు

రామవరప్పాడు: నిడమానూరు పంచాయతీ పరిధిలో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు అవలంభిస్తున్న తీరు బుడమేరు కాలువకు శాపంగా మారింది. ఇటు పంచాయతీ అటు ఇరిగేషన్ అధికారుల అనుమతులు, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి వీరు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కేకేఆర్ గౌతమ్ పాఠశాల సమీపంలోని ఓ కార్పొరేట్ కళాశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా గతంలో పంచాయతీ రోడ్డులో అనుమతులు లేకుండా కళాశాల ప్రహరీగోడ వెంబడి రోడ్డును ధ్వంసం చేసి అంతర్గత డ్రెయినేజీ నిర్మించారు. కళాశాల మెస్‌లోని ఆహార వ్యర్థాలు, చెత్త చెదారాలు బుడమేరు కాలువలో డంప్ చేస్తున్నారు. గతంలో తవ్విన డ్రెయిన్‌కు పైప్‌లైన్ అమర్చి వ్యర్థజలాలను నేరుగా బుడమేరులో కలుపుతున్నారు. బుడమేరు కాలువకు ఆనుకుని ఉన్న పొలాల రైతులు, గ్రామస్తులు పలుమార్లు వీరి చర్యలకు అభ్యంతరం వ్యక్తం చేసినా ఇప్పటివరకూ యాజమాన్యం ఎటువంటి పరిష్కార మార్గాలు అవలంభించలేదు. పైగా ఈ కార్పొరేట్ కళాశాల పక్క గ్రామమైన గూడవల్లి పరిధిలో ఉంది. దీంతో కళాశాల యాజమాన్యం కూడా ట్యాక్స్‌లను గూడవల్లి పంచాయతీకే చెల్లిస్తుంది. కాగా కళాశాలకు సంబంధించిన డ్రెయిన్ మాత్రం నిడమానూరు పరిధిలో ఉంది.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు

ప్రతి ఏడాది వర్షాకాలంలో నిడమానూరు, గూడవల్లి రైతులతో పాటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిడమానూరు జాతీయ రహదారిపై వోల్వో షోరూమ్ ఎదురుగా ఉన్న మరో కార్పొరేట్ కళాశాల కూడా వ్యర్థజలాలను బుడమేరులోనే కలుపుతున్నారు. ఈ కళాశాల మురుగు నీరు కూడా సమీప పంట పొలాల్లోకి వదులుతున్నారని గతంలో రైతులు ఆందోళన చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల వచ్చిన వరదల కారణంగా బుడమేరు పొంగి పంట పొలాలు, నివాసాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. వర్షపునీటికి తోడు బుడమేరులో డ్రెయిన్‌ల మురుగు నీరు, కార్పొరేట్ కళాశాలల వ్యర్థ జలాలు కలుస్తుండటంతో చిన్నపాటి వర్షాలకు కూడా బుడమేరు పొంగుతోందని ఇరు గ్రామ ప్రజలు తమ బాధలు వ్యక్తబరుస్తున్నారు. కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్య వైఖరి కారణంగా బుడమేరు కలుషితమవడమే కాకుండా ప్రమాదకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్, పంచాయతీ అధికారులు స్పందించి కాలువ కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, బుడమేరు ముంపు నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ట్యాక్స్‌పై వివాదం

బుడమేరు రానూ రానూ కాలుష్యమవుతుండటంతో కళాశాల డ్రెయిన్ వివాదం మరల తెరపైకి వచ్చింది. ఈ డ్రెయిన్ నిడమానూరు పంచాయతీ పరిధిలో ఉండటంతో ట్యాక్స్‌ను ఈ పంచాయతీ కూడా చెల్లించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో నిర్వహించిన పంచాయతీ సమావేశంలో డ్రెయిన్ అంశాన్ని అప్పటి పాలకవర్గ సభ్యులు తెరపైకి తీసుకొచ్చారు. డ్రెయిన్ నిడమానూరు పంచాయతీ పరిధిలో ఉంది కాబట్టి ట్యాక్స్‌లను కూడా ఈ పంచాయతీకే చెల్లించాలని సమావేశంలో వాదనలు వినిపించారు. దీంతో డ్రెయిన్‌ను తొలగించాలని పంచాయతీ నోటీసులు కూడా జారీ చేసింది. ఈ ఘటన జరిగి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ కూడా కళాశాల యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



బుడమేరులో కలుస్తున్న వ్యర్థజలాలు

పురుగు మందుల గోదాం తనిఖీ



పెనమలూరు: మండల పరిధిలో పురుగు మందుల గోడౌన్‌లను మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ శుక్రవారం తనిఖీ చేశారు. కానూరు సనత్‌నగర్‌లో పురుగు మందు గోడౌన్, పెనమలూరులో ఎరువులు, పురుగు మందు దుకాణాన్ని పరిశీలించారు. ఆయా దుకాణాల్లో స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ధరల ప్రకారమే విక్రయిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. రైతులు ఎరువులు, పురుగుల మందులు ప్రకటించిన ధరలకు కొనుగోలు చేయాలని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ హెచ్చరించారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

గన్నవరం: చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి మరమ్మతులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు శుక్రవారం చేపట్టారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జాతీయ రహదారి తారు కరిగి దిబ్బలుగా ఏర్పడింది. అక్కడక్కడ గుంతలు కూడా ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రహదారికి మరమ్మతులు చేస్తున్నారు. రోడ్డుపై తారు దిబ్బలను తొలగించడంతో పాటు గుంతలు పూడ్చి మరమ్మతులు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా మృత్యుంజయ సహిత రుద్ర హోమం



మహా మృత్యుంజయ హోమంలో భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ ప్రాంగణంలో మాజీ జెడ్పీటీసీ కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా మహా మృత్యుంజయ సహిత రుద్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తికమాసం పురస్కరించుకుని నెల ప్రారంభం నుంచి ఇక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమ వద్ద విశేష పూజలు చేశారు. అనంతరం హోమ గుండం వద్ద భక్తులు మృత్యుంజయ సహిత రుద్ర హోమాన్ని నిర్వహించారు. తొలుత గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని అన్నాభిషేకం, దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నైతికవిలువలపై అవగాహన



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న 'మానవత' సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు నైతిక విలువలు కలిగినప్పుడే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోగలరని మానవత స్వచ్ఛంధ సంస్థ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలనులోని జెడ్పీ హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన తరగతులను శుక్రవారం నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పట్టుదల, ప్రణాళికతో కృషి చేయాలని ఆయన చెప్పారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గత ఏడాది ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు మానవత ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విద్యార్థులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను మానవత సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీడీ ప్రసాదరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యదర్శి ప్రాబోలు గణేష్, సీనియర్ సభ్యులు కొట్నాని రామచంద్రరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

- నత్తనడకన ధాన్యం కొనుగోలు
- పడిగాపులు కాస్తున్న రైతులు



గంగూరులో రోడ్డుపై ధాన్యం రాసులు

పెనమలూరు: రైతులు పండించిన వరి పంట చేతికి వచ్చినా ధాన్యం అమ్మకాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతులు పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో సార్వ వరి సాగు దాదాపు 5,500 ఎకరాల్లో జరిగింది. ధాన్యం దిగుబడి 15 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. అయితే వరి కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలులో గందరగోళం నెలకొంది. గతంలో రైతుభరోసా కేంద్రాల నుంచి ధాన్యం చాలా వేగంగా రైతులు అమ్ముకునే వారు. అయితే ఈ ఏడాది పరిస్థితులు మారిపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోలుపై ప్రకటలు చేస్తున్నా ఆచరణలో మాత్రం రైతుల సమస్యలు తొలగడం లేదు.

ఎక్కడి ధాన్యం అక్కడే

కాగా మండల పరిధిలో ఇప్పటివరకు 1,500 ఎకరాల్లో వరి కోతలు జరిగాయి. వరి కోతలు మరింత వేగంగా జరుగుతున్నాయి. 1,500 ఎకరాలకు గాను 1,510 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే మిల్లులకు తరలించారు. రైతులు ఇంకా రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాలు, రహదారులపై ఉంచారు. సకాలంలో రవాణా సదుపాయం లేకపోవడం, అధికారులు ప్రకటించిన విధంగా మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం తేమ శాతం 25 ఉన్నా బస్తా రూ. 1,600 తగ్గకుండా ధర ఇస్తామని ప్రకటించినా ఆచరణలో అమలు జరగడం లేదు. ప్రస్తుతానికి దళారుల దందా బాగా ఉంది. దళారులు కొనుగోలు చేసిన ధాన్యం మాత్రం వెంటనే మిల్లులకు తరలివెళుతోంది. రైతులకు దళారులు బస్తాకు రూ. 1,400 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఉంగుటూరు: ఫెంగల్ తుపాన్ ప్రభావం కృష్ణా జిల్లాకు కూడా ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకుని, అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి హరీష్ కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి వరి పొలాలు, ధాన్యం రాసులను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఓ హరీష్ మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. మిల్లుకు తరలించని రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో పట్టాలు కప్పి ఉంచాలని సూచించారు. అలాగే రబీకి సంబంధించి మినుము, పెసర విత్తనాలు సబ్సిడీపై ఉంగుటూరులో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో వీఏఏలను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌పై రోడ్డు ప్రమాదం

స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుకు అడ్డంగా పడిన పచ్చిమిర్చి వ్యాన్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు బుడమేరు కాలువ వద్ద చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసుల సమాచారం ప్రకారం.. విజయవాడ నుంచి ఏలూరు వైపు బూడిద లోడ్‌తో వెళ్తున్న లారీ కేసరపల్లి శివారు బుడమేరు కాలువ వద్దకు రాగానే టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపై నిలిచిపోయింది. అదే సమయంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన పచ్చిమిర్చి వ్యాన్ ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అదే రూటులో వచ్చిన సిమెంట్ లారీ వేగాన్ని నియంత్రించుకోలేక పచ్చిమిర్చి వ్యాన్‌ను ఢీకొట్టి కొంత దూరం వరకు ఈడ్చుకువెళ్లింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎస్‌కేల ద్వారానే ధాన్యం కొనుగోలు

గన్నవరం రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రజని తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలు తెలుపుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సేవా కేంద్రాల ద్వారా మాత్రమే అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా గోనె సంచులు సరఫరా చేస్తుందని చెప్పారు. లేబర్ ఛార్జీల భారం ప్రభుత్వానిదేనన్నారు. ధాన్యం సాధారణ రకం క్వింటాకు రూ. 2,300, 75 కేజీలకు రూ.1,725, ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,320, 75కేజీలకు 1,740 చెల్లిస్తున్నట్లు వివరించారు. తేమ శాతం 17 లోగా ఉండే విధంగా రైతులు ధాన్యం ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని సూచించారు.

గొలుసు దొంగతనాలపై అప్రమత్తం




ఉంగుటూరు: రోడ్డు పక్కన దుకాణాలు నిర్వహిస్తున్న ఒంటరి మహిళలే లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడుతున్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆత్కూరు పోలీసులు దుకాణదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. తేలప్రోలు, పెద్ద అవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో జాతీయ రహదారి సమీపంలో ఉన్న దుకాణాల్లో ఉన్న మహిళలకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఇటీవల గుడివాడ, నూజివీడు, హనుమాన్‌జంక్షన్ ప్రాంతాల్లో అడ్రస్ అడుగుతున్నట్లు, షాపులో ఏదో కొంటున్నట్లు నమ్మించి మెడలో గొలుసు లాక్కెళ్లిన సంఘటనలు జరిగాయని చెప్పారు. గొలుసు దొంగతనాలు జరగకుండా మహిళలకు నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని ఆత్కూరు ఎస్ఐ సురేష్ తెలిపారు.

కనులపండువగా కార్తిక దీపోత్సవం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో కార్తికమాస శివరాత్రిని పురస్కరించుకుని దశ సహస్ర దీపోత్సవాన్ని శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తిక దీపాలు వెలిగించారు. దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ డైరెక్టర్ కొల్లి రాజశేఖర్ దంపతుల చేతుల మీదుగా దశ సహస్ర దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో 10 వేల కార్తిక దీపాలను శివలింగాకృతిలో వెలిగించారు. తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కల్యాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ప్రమీలారాణి, ఆలయ కమిటీ సభ్యులు నందూరు సత్యవెంకటేశ్వర శర్మ, నక్కా బాబు, పుట్టి కోటేశ్వరరావు, నాగరాజు, షేక్ సాంబశివరావు పాల్గొన్నారు.





వైభవంగా కోటి దీపోత్సవం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం కోటి దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణదాత సంగా నరసింహారావు దంపతులు కోటి దీపోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు చేశారు. దీపాల వెలుగులో ఆలయ ప్రాంగణం కార్తిక శోభసంతరించుకుంది.